విశాలాంధ్ర గోదావరి జిల్లా

ఏలూరు, పశ్చిమగోదావరి

విద్యార్థులకు భారం 'ఈ -కంటెంట్'

- ఇప్పటికే పిల్లల నెత్తిన బైజూస్ పాఠాలు
- కొత్తగా ఎన్‌సీఈఆర్‌టీ ఈ-పాఠశాల యాప్

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: ప్రాథమిక విద్యారంగంలో వినూత్న సంస్కరణలకు శ్రీకారం చుట్టామని చెబుతున్న ప్రభుత్వం నేడు విద్యా వ్యవస్థను డిజిటల్ మయం చేసింది. ఇప్పటికే ఉపాధ్యాయులు పాఠాలు చెబుతూ విద్యార్థులను తీర్చిదిద్దుతుండగా అది చాలదన్నట్లుగా డిజిటల్ విద్యను ప్రవేశపెడుతున్నారు. డిజిటల్ విద్యతో విద్యార్థులకు పరిచయం అవసరమే కానీ అది ప్రాథమిక స్థాయిలో వారిపై మోయలేని భారంగా మారకూడదు. ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న ఈ-కంటెంట్ విద్య విద్యార్థులకు భారంగా మారనుంది. ఇప్పటికే విద్యార్థులకు బైజూస్ యాప్ పాఠశాలలను అందుబాటులోకి తెచ్చారు. ఇది చాలదన్నట్లుగా కొత్తగా రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ మండలి విద్యార్థులకు ఈ-కంటెంట్‌ను అందించేందుకు ఈ-పాఠశాల అనే యాప్ రూపొందిస్తోంది.

బైజూస్ పరిస్థితి ఏమిటి? ఇప్పటికే రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో 4 నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు బైజూస్ ద్వారా ఈ-కంటెంట్‌ను అందిస్తున్నారు. కేవలం నాన్ లాంగ్వేజ్ సబ్జెక్టు లలో మాత్రమే అందిస్తున్నారు. ఒకవైపు విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు ఉంటూనే వారిచ్చే హోంవర్కులు చేస్తూ మళ్ళీ బైజూస్ లోనూ పాఠాలు విని ఎక్సర్సైజ్ చేయాల్సి వస్తోంది. ఇప్పటికే ఇది విద్యార్థులకు భారంగా మారింది. కొత్తగా ఎన్ సి ఇ ఆర్ టి రూపొందించిన ఈ-కంటెంట్ ను విద్యార్థులు చదవాల్సి రావడం అంటే అది ఇంకా అదనపు భారంగా మారనుంది.ఎస్ ఐ ఆర్ లాంగ్వేజ్, నాన్ లాంగ్వేజ్ రెండింటి ఈ- కంటెంట్ తయారు చేస్తోంది. ఇప్పటికే నాన్ లాంగ్వేజ్ కంటెంట్ విద్యార్థులు ఫాలో అవుతున్నారు. ఇప్పుడు వచ్చే ఏడాది ఈ రెండిట్లో ఏ కంటెంట్‌ను ఫాలో అవ్వాలో అయోమయంలో పడిపోయారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు ఇంత పెద్ద ఎత్తున డిజిటల్ విద్య అవసరం లేదని విద్యారంగ నిపుణులు తెలుపుతున్నారు. కొంత డిజిటల్ విద్యను పరిచయం చేసి ఉపాధ్యాయుల ద్వారానే బాగా పాఠాలు చెప్పిస్తే సరిపోతుందని నిపుణులు చెప్తున్నారు.

ఈ-పాఠశాలలో ఉండేవి ఇవే : ఎన్‌సిఇఆర్‌టి ఈ-పాఠశాల యాప్ ని ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరానికి కల్లా సిద్ధం చేయబోతోంది. ఈ యాప్ లో 4వ తరగతి నుండి 9వ తరగతి వరకు పాఠాలు డిజిటల్ రూపంలో ఉంటాయి. ప్రశ్నలు, జవాబులు, ఎక్సర్సైజ్ లు దీంట్లో ఉంటాయి. లాంగ్వేజెస్, నాన్ లాంగ్వేజెస్ రెండు రకాల సబ్జెక్టుల లోను ఈ-కంటెంట్ అందుబాటులో ఉంటుంది. ఈ-కంటెంట్ ను ఆంధ్రప్రదేశ్ ఈ- పాఠశాల, యూట్యూబ్, దీక్ష ప్లాట్ ఫామ్,పి ఎం, ఈ- విద్య అందుబాటులో ఉంచుతారు.

అర్థం కాక తల పట్టుకుంటున్నారు : ఇప్పటికే బైజూస్ లో వస్తున్న పాఠాలను విద్యార్థులు చూసి అర్థంకాక తల పట్టుకుని అలాగే నిమగ్నమై ఆన్ లైన్ యాప్ లో చూస్తూనే ఉండిపోతున్నారు. ప్రత్యక్షంగా ఉపాధ్యాయుల దగ్గర నుండి విద్యా బోధన చేస్తే ఎంతటి కష్టమైన పదాలు, వాక్యాలైనా విద్యార్థులకు అర్థమయ్యేలా ఉంటాయి. విద్యార్థికి అర్థం కాకపోతే ఆ ఉపాధ్యాయుడికి తిరిగి మరలా చెప్పి చదివించగలుగుతాడు. అదే బైజూస్, ఈ-కంటెంట్‌లలో విద్యాబోధన చేస్తే ఎవరిని ప్రశ్నించాలి, ఆ ప్రశ్నలకు జవాబులు ఎవరు చెబుతారు, వారు చెప్పిన జవాబులు పిల్లలకి అర్థం అవుతాయా లేదా అనే సందిగ్ధంలో విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తుపై ఆందోళన పడుతున్నారు.

ప్రభుత్వ కళాశాలలో జీరో ఉత్తీర్ణత

- ధర్మాజీగూడెం ప్రభుత్వ కళాశాల తీరుపై ఆగ్రహిస్తున్న ప్రజలు
- చదువులు ఉండవు.. చదివేందుకు రాని విద్యార్థులు

విశాలాంధ్ర - లింగపాలెం : ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసుకున్న ధర్మాజీగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫలితాలు, పరీక్షలకు విద్యార్థుల హాజరు శాతం చూసి ప్రజలు నివ్వెరపోతున్నారు. తాము కష్టపడి సాధించుకున్న ప్రభుత్వ కళాశాలకు ఇదేం దుస్థితి అంటూ తీవ్ర స్థాయిలో ప్రజలు విమర్శలు చేస్తున్నారు. పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించరు.. ఉన్న సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఈ కళాశాల దీన స్థితిలో ఉందంటూ ఆక్రోశిస్తున్నారు. ఇంటర్ ఫలితాలు చూసి ఆగ్రహిస్తున్నారు. ఈ కళాశాల నుండి సెకండ్ ఇంటర్‌లో ఒక్క విద్యార్థి మాత్రమే పరీక్ష రాసి ఫెయిల్ అయ్యాడు. మొదటి ఇంటర్‌లో నలుగురు ఫీజులు చెల్లించారు. ఇద్దరే పరీక్షలు రాశారు. పరీక్షలు రాసిన ఇద్దరు విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. దాదాపు 34 ఏళ్ళ క్రితం ఉమ్మడి రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా నెలకొల్పిన ఈ కళాశాల దుస్థితిపై ప్రతీ ఒక్కరు ఇప్పుడు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ప్రజల భాగస్వామ్యంతో దాదాపు మూడు ఎకరాల స్థలాన్ని కళాశాలకు కొనుగోలు చేసి ఇచ్చారు. ప్రభుత్వం పక్కా భవనాలు నిర్మించింది. ఇప్పుడు నాడు-నేడులో కళాశాల అభివృద్ధికి లక్షలు కేటాయించారు. ఇంత చేసినా ఇక్కడ చదువులు ఉండవు.. చదువుకోవటానికి వచ్చేవారు ఉండరనే విమర్శలు ఉన్నాయి. వచ్చిన విద్యార్థుల చదువు చూస్తే జీరోశాతం ఉత్తీర్ణత ఈ ఏడాది ఫలితాలకు ఉదాహరణగా ఉంది. ఇటువంటి కళాశాల దుస్థితిని మార్పు చేయటానికి ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుంటారా ? లేదోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.

శాంతి భద్రతలు కాపాడటంలో పోలీసులు కీలకంగా ఉండాలి

విశాలాంధ్ర - లింగపాలెం : ధర్మాజీగూడెం పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ మేరీ ప్రశాంతి గురువారం పరిశీలించారు. ఎస్పీగా బాధ్యతలు తీసుకున్న ఈమె మొదటిసారి స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా కొద్దిసేపు సిబ్బందితో మాట్లాడారు. లింగపాలెం మండలంలోని పరిస్థితులపై ఎస్ఐ చెన్నారావును అడిగి తెలుసుకున్నారు. అన్యాయానికి గురైన వారు పోలీసులను ఆశ్రయిస్తే కచ్చితంగా న్యాయం చేయాలని తెలిపారు. శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని కోరారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండవద్దని అన్నారు. అరాచకంగా వ్యవహరించే వారిపై కఠినంగా ఉండాలన్నారు. పోలీస్‌స్టేషన్లపై అవగాహన కోసం ఈమె ప్రత్యేక పర్యటన చేశారు. ఎస్పీకి ఎస్ఐ సిబ్బంది సాదరంగా స్వాగతం పలికారు. ఎస్పీ పర్యటనలో సీఐ మల్లేశ్వరరావు ఉన్నారు.

సొసైటీలో తీసుకున్న అప్పులపై అనుమానాలుంటే అభ్యంతరాలు తెలపండి

విశాలాంధ్ర-టి నరసాపురం : టి నరసాపురం సొసైటీలో అప్పులు తీసుకొన్న వారు అప్పులపై అనుమానాలుంటే విచారణ పూర్తయ్యే లోపు ఫిర్యాదు చేయాలని విచారణ అధికారి అబ్దుల్ హాది గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం స్థానిక సహకార సంఘలో జరుగుతున్న 51 విచారణలో భాగంగా ఇప్పటికే అప్పుదారులందరికీ నోటీసులు పంపామని ఎవరికైనా అప్పులపై సందేహాలుంటే విచారణ అధికారిని కలిసి అప్పు నిర్ధారణ చేసుకోవాలన్నారు. విచారణ త్వరలో ముగుస్తుందని ఈలోపే సంప్రదించాలని తెలిపారు. విచారణ పూర్తయితే ఎటువంటి అభ్యంతరాలు స్వీకరించబడవని ఆయన తెలిపారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజి కాగితాలకే పరిమితమా

విశాలాంధ్ర - చాట్రాయి : కార్పొరేట్ విద్యాసంస్థలు సైతం తమ పాలనలో ప్రభుత్వ విద్యను చూసి భయాందోళనకు గురవుతున్నారని ముఖ్యమంత్రి జగన్ చెప్పుకోవడం నేతి బీరలో నెయ్యి చందంగా ఉందని సామాజిక చైతన్య వేదిక ఆర్గనైజర్ ఇవి శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చాట్రాయి మండలంలో ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల గత సంవత్సరం మంజూరు అయ్యిందని ప్రకటనలు చేశారని నేటికీ అతిగతి లేదన్నారు. కనీస మౌలిక వసతులు ఎక్కడ....? బోధన సిబ్బంది ఆచూకీనే లేదన్నారు.మండల విద్యాశాఖ అధికారిని సదరు విషయమై వివరణ కోరగా ఎంపీసీ ,బైపిసి రెండు గ్రూపులు ఇంగ్లీష్ మీడియం మాత్రమే మంజూరయ్యాయని తెలిపారు. బోధనా సిబ్బంది గురించి అడగగా స్పష్టమైన సమాధానం లేదు. హైస్కూల్లో ఉన్న ఉపాధ్యాయులే కాలేజీ విద్యార్థులకు పాఠాలు చెప్తుంటారని, విద్యార్థులు జూనియర్ కళాశాలలో చేరితే అప్పుడు బోధన సిబ్బంది వస్తారని పొంతన లేని సమాధానం చెబుతున్నారని ఆరోపించారు. కలబొల్లి మాటలతో కాలయాపన చేయకుండా మౌలిక వసతులు సమకూర్చి బోధనా సిబ్బందిని ఏర్పాటు చేసి చెప్పిన మాట ప్రకారం కాలేజీ ప్రారంభించాలని సామాజిక చైతన్య వేదిక డిమాండ్ చేస్తుందన్నారు.

మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సు

విశాలాంధ్ర-ఏలూరు: మహిళల కోసం జిల్లా న్యాయ శాఖ అధికారి సంస్థ ఉచిత సేవలు అందిస్తుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. రాజేశ్వరి అన్నారు.ప్రజా సమస్యల శాశ్వత న్యాయ పీఠం చైర్మన్ మేరీ గ్రేస్ కుమారి గురువారం ఏలూరు లోని టైటస్ నగరలోని మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ న్యాయం కోసం మహిళలు ఈ సేవలను అవసరమైన వారు వినియోగించుకోవచ్చన్నారు. మే 13వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని ఈ జాతీయ లోక్ అదాలత్‌లో అన్ని రకాల సివిల్, కుటుంబ తగాదా, వాహన ప్రమాద, రెవెన్యూ కేసులు, రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులను రాజీ చేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకోవాలని తెలియ జేశారు. ప్రజా సమస్యల శాశ్వత న్యాయ పీఠం చైర్మన్ ఏ. మేరీ గ్రేస్ కుమారి, సీనియర్ న్యాయవాది కూన కృష్ణారావు మాట్లాడుతూ అగ్రిమెంట్లు రాసేటప్పుడు క్షుణంగా పరిశీలించుకుని సంతకం చేయాలని,వృద్ధులైన తల్లిదండ్రులను సంరక్షణ బాధ్యత కుమారులతోపాటు కుమార్తెలకు ఉంటుందని, వృద్ధులను బాధ్యతతో చూసుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్ మేతర అజయ్ బాబు, మెప్మా సీఈవో రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం

విశాలాంధ్ర-టి నరసాపురం: అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతామని ఏలూరు జిల్లా ఎస్‌పి డి. మేరీ ప్రశాంతి తెలిపారు. టి నరసాపురం పోలీసు స్టేషన్ ను గురువారం ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడి పందాలు, పేకాట వంటి జూద క్రీడలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. శాంతి భద్రతలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె. సతీష్ కుమార్ ,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేటితరానికి ఆదర్శనీయం... దాసరి పోరాట స్ఫూర్తి

విశాలాంధ్ర-నూజివీడు : భూపోరాట ఉద్యమనేతగా ,ప్రజా సమస్యలపై అహర్నిశలు పోరాడిన దాసరి నాగభూషణరావు సేవలు నేటి తరానికి ఆదర్శనీయమని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య పేర్కొన్నారు. మాజీ రాజ్యసభ సభ్యులు, సిపిఐ జాతీయ నాయకులు దాసరి నాగభూషణరావు 15వ వర్ధంతి కార్యక్రమం నూజివీడులో గురువారం నిర్వహించారు. మండలంలోని దాసరి స్వగ్రామం దిగవల్లి గ్రామంలో దాసరి విగ్రహానికి ఏలూరు జిల్లా సీపీఐ కార్యదర్శి కృష్ణచైతన్యతో పాటు సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు చలసాని వెంకటరామారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం నూజివీడు నియోజకవర్గ సిపిఐ కార్యాలయం అమర్‌భవన్‌లో దాసరి చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు.ఈ సందర్భంగా జరిగిన సభలో కృష్ణచైతన్య,రామారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు ఆర్థికాభివృద్ధి సాధించాలంటే రైతు కూలీలు రైతులుగా మారాలన్న సదుద్దేశంతో దాసరి రాష్ట్రవ్యాప్త భూపోరాటాలను నిర్వహించారన్నారు. ఎందరో భూమిలేని పేదలకు అటవీబంజర్లను పంపిణీ చేసి వారిని రైతులుగా మార్చారన్నారు. పేదల సాగులోని భూములకు చెట్టుపట్టాలు ఇప్పించిన ఘనత దాసరిదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో దాసరికున్న పట్టుదల నేటి తరం కమ్యూనిస్టులకు ఆదర్శం కావాలన్నారు.ఈ కార్యక్రమాలలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, సిపియం నియోజకవర్గ కార్యదర్శి జి.రాజు, సిపిఐ సీనియర్ నాయకులు గుంటక ధర్మారెడ్డి, రాయంకుల లక్ష్మణరావు,అక్కినేని వరప్రకాశరావు,మదుపల్లి నాగేంద్రరావు, ఈమని శేషయ్య, కూచిపూడి నాగేశ్వరరావు, దిగవల్లి మాజీ యంపిటిసి యలమంచలి నాగేంద్రప్రసాద్, సిపిఐ పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు,సిఐటియు నాయకులు హనుమాన్లు తదితరులు పాల్గొన్నారు.

మేడే సందర్భంగా వాడవాడలా అరుణ పతాకాలు ఆవిష్కరించాలి

విశాలాంధ్ర-తణుకు: కార్మికుల పర్వదినం మేడే సందర్భంగా వాడవాడలా అరుణ పతాకాలు ఆవిష్కరించి ఘనంగా నిర్వహించాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆఫ్ శ్రీ సత్యనారాయణ స్పిన్నింగ్ మిల్స్ ఉపాధ్యక్షుడు కోనాల భీమారావు కోరారు.గురువారం తణుకు కలిదిండి భీమరాజు భవన్ నందు శ్రీసత్యనారాయణ స్పిన్నింగ్ మిల్స్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది.సమావేశానికి భీమారావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సంక్షేమానికి విరుద్ధంగా పాలన సాగిస్తున్నారన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటల పని దినానికి తిలోదకాలిస్తూ 12 గంటల పని అమలు చేయడానికి పూనుకోవడాన్ని వ్యతిరేకంగా కార్మికులు మేడే ఉద్యమ పోరాట స్ఫూర్తితో ఉద్యమించి 8 గంటల పనిదినాన్ని కాపాడుకోవాలన్నారు .స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆఫ్ శ్రీ సత్యనారాయణ స్పిన్నింగ్ మిల్స్ కార్యదర్శి దాకే ముసలయ్య, ఉపాధ్యక్షులు అట్టు వెంకట్రావు,గరగ శ్రీనివాస్,కరుటూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాశిరకం ఇసుకతోనే నిర్మాణం చేశారు

విశాలాంధ్ర-చాట్రాయి: అనుమతి లేని నాశిరకం ఇసుక తోనే ప్రభుత్వ అంచనాలతో మంజూరైన రోడ్లు భవనాలు నిర్మించి నట్లు రుజువైందని చిన్నంపేట కు చెందిన నాయకులు కొమ్ము సుజన రావు ఆరోపించారు. గురువారం ఆయన విశాలాంధ్రతో మాట్లాడుతూ చాట్రాయి మండలం చిన్నంపేటలో ప్రభుత్వం మంజూరు చేసిన సిమెంట్ రోడ్డు డ్రైనేజీ నిర్మాణానికి ఇసుకను ఇబ్రహీం పట్నం రీచ్ నుంచి తీసుకురావాలని అధికారులు అంచనాలు వేయగా స్థానికంగా వున్న తమ్మిలేరులో అనుమతిలేని ఇసుకతో నిర్మించినట్లు రుజువైందన్నారు. ఇసుక తోలినప్పుడే పత్రికా ముఖంగా సామాజిక మాధ్యమాల ద్వారా తెలియజేశానని అధికారులు సరిగా స్పందించకపోవడంతో సమాచార హక్కు చట్టంలో అడిగి సమాచారం తీసుకున్నానని ఇచ్చిన ఆధారాల ప్రకారం ఇబ్రహీంపట్నం నుండి ఇసుక తీసుకురావాలని స్పష్టంగా ఉందన్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేసినా ప్రభుత్వ అధికారులు, ప్రజలు నిరంతరం వుండే కార్యాలయాలు నాశిరకం ఇసుక తో నిర్మిస్తే అవి కూలి పోతే పరిస్థితి ఏమిటని పలువురు ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిపారు.

మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-ఏలూరు: అంతర్జాతీయ కార్మిక దినో త్సవం మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర ఉపాధ్య క్షులు భజంత్రి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఏపి మున్సిపల్ వర్కర్ యూనియన్ ఏలూరు నగర సమితి ముఖ్య కార్యకర్తల సమావేశం యూనియన్ అధ్యక్షులు దుర్గారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న భజంత్రీ శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న మున్సిపల్ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై ఐక్యంగా పోరాడాలన్నారు.137వ మేడే దినోత్సవం సందర్భంగా ఏలూరు కార్పొరేషన్ పరిధిలో 16 సర్కిల్ మస్టర్ పాయింట్లు వద్ద ఏఐటియుసి జండాలు ఆవిష్కరించాలని కోరారు. కార్మికుల పట్ల పాలకవర్గాలు అవలంబిస్తున్న విధానాలను ఎండగట్టాలన్నారు. 8 గంటల పని విధానం కోసం కార్మికులు ప్రాణాలు అర్పించారని, తిరిగి ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 12 గంటల పని విధానం అమలు కోసం చేసే ప్రయత్నాన్ని మున్సిపల్ కార్మికులు పోరాటాల ద్వారా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని, అమాదవశాత్తు మరణించిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియో, చెల్లించాలన్నారు. ఆప్కాస్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే రోజులలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో అధ్యక్షులు యలగాడ దుర్గారావు, కార్యనిర్వాహక అధ్యక్షులు యలగాడ శివకుమార్, యూనియన్ ఉపాధ్యక్షులు బంగారు దుర్గాప్రసాద్, కార్యదర్శి దొడ్డికర్ల నాగబాబు, కౌన్సిల్ సభ్యులు ముదరబోయిన భాస్కరరావు, మాదుగుల జగదీష్, గూదుపు దుర్గారావు , బంగారు దేవేంద్ర, కిలారి వెంకన్న బాబు, కాకాని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలను ఎండగడుతూ మేడే ఉత్సవాలను నిర్వహించాలి

విశాలాంధ్ర - ఏలూరు: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను మే 1వ తేదీ సోమవారం ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాలు, కేంద్ర ,ప్రభుత్వ వ్యతిరేక దినంగా జరపాలని ఏఐటియుసి ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వర రావు ఉద్యోగ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. కేంద్రంలో 2014 నుండి బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో ఉద్యమాల ద్వారా, పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 కార్మిక కోడ్ లుగా మార్చి కార్మిక వర్గానికి అన్యాయం చేస్తుందని కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. బిజెపి నాయకత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం చేస్తున్న తప్పుడు విధానాల్ని ఎండ కడుతూ వాడ వాడల మేడే కార్యక్రమాన్ని ఘనంగా జరపాలని కోరారు. కార్మిక ప్రదేశాలలో తోరణాలతో అలంకరణ చేసి పతాకాల ఆవిష్కరణ చేసి సభలు సమావేశాలు జరపాలన్నారు. ఏఐటీయుసీ నాయకులు, కార్యకర్తలు, పట్టణాలు, మండల కేంద్రాలలో సిపిఐ శ్రేణులతో కలిపి మేడే ఉత్సవాలను జరపాలని పిలుపునిచ్చారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

విశాలాంధ్ర - కుక్కునూరు: కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని సిపిఐ కుక్కునూరు మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి అన్నారు.గురువారం కుక్కునూరులో జరిగిన సిపిఐ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెట్రోలు, డీజిల్, గ్యాస్ నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు. కార్మికులు, కర్షకులు బ్రతికే ప్రసక్తి లేదన్నారు. ఇదే బిజెపి ప్రభుత్వం మరలా ఈ దేశంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే భారతదేశ ప్రజలంతా బానిసలుగా బ్రతకాల్సి వస్తుందని ,ఈ బానిస బ్రతుకులు రాకుండా ఉండాలంటే కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక వాగ్దానాలు చేసి అరకొర పథకాలను అమలు చేస్తున్నదని, ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలు అందరికి వర్తింపచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు అయితా సురేష్ బాబు, కొన్నె లక్ష్మయ్య, కూరాకుల బాబురావు, వరకా నరసింహారావు, వరసా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మేడేను పండుగ వాతావరణంలో నిర్వహించాలి

విశాలాంధ్ర -భీమవరం: మేడే కార్యక్రమాన్ని ఘనంగా జరిపి కార్పొరేట్ శక్తులకు కార్మిక శక్తిని నిరూపించాలని ఎఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు పిలుపునిచ్చారు. మేడే సన్నాహక సమావేశం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో ఎఐటియుసి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. మేడే స్ఫూర్తితో హక్కుల సాధనకై అలుపెరుగని ఉద్యమాలు నిర్వహించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కిలారి మల్లేశ్వరరావు, సిపిఐ, ఎఐటియుసి నాయకులు బంగారు శివ, దుర్గారావు, ఆశీర్వాదం, నీలాపు శ్రీను, సత్యనారాయణ, ఆకల రాము, వై.వి.ఆనంద్, పాలా త్రిమూర్తులు, పి.యాకోబు తదితరులు పాల్గొన్నారు.

భగీరధుడు దీక్షకు, సహనానికి ప్రతిరూపం

- జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: భగీరధుడు దీక్షకు, సహనానికి ప్రతిరూపమని ఎంతటి కష్టాన్నైనా లెక్కచేయకుండా అనుకున్నది సాధించారని జిల్లా కలెక్టర్ ప్రశాంతి అన్నారు. గురువారం శ్రీ భగీరథ మహర్షి జయంతి మహోత్సవం సందర్భంగా కలెక్టరేట్లోని స్పందన సమావేశం మందిరంలో శ్రీ భగీరథ మహర్షి జయంతి మహోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ గంగా జలాలను దివి నుండి భూమికి తీసుకువచ్చిన ఘనత భగీరథుడికి దక్కుతుందని కలెక్టరు అన్నారు. భగీరథుడు మహా జ్ఞాని ,పరోపకారానికి పెట్టింది పేరన్నారు. కష్టసాధ్యమైన పనిని సాధించాలంటే భగీరథుని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ దాసి రాజు, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జి.గణపతి రావు , జిల్లా అధికారులు,ఇతర నాయకులు, విద్యార్థినీ విద్యార్థులు, తది తరులు పాల్గొన్నారు.

భగీరథ జయంతి మహోత్సవాలు

విశాలాంధ్ర-ఏలూరు: పట్టుదలకు, త్యాగానికి మారుపేరు భగీరథ మహర్షి అని జిల్లా రెవెన్యూ అధికారి ఎ.వి. ఎన్ .ఎస్ .మూర్తి కొనియాడారు. భగీరథ మహర్షి జయంతి పురస్క రించుకుని స్థానిక కలెక్టరేట్లోని గౌతమి సమావేశ మందిరంలో భగీరథ జయంతి జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ మహోత్సవాలకు జిల్లా రెవెన్యూ అధికారి ఎ.వి. ఎన్. ఎస్ .మూర్తి , జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్. వి. నాగమణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ ఆశా పాల్గొని భగీరథ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఓ మాట్లాడుతూ ఎవరైనా కఠోర శ్రమ చేసి దేన్నైనా సాధిస్తే భగీరథ ప్రయత్నం అని చెబుతారన్నారు. గంగను దివి నుంచి భువికి తీసుకువచ్చిన మహర్షి, మంచినీటి కొరతతో ఇబ్బంది పడుతున్న ప్రాణకోటి కష్టాలు తీర్చిన మహనీయుడు భగీరథ మహర్షి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు భగీరథ చిత్రపటం వద్ద డిఆర్‌ఓ జ్యోతి ప్రజ్వలన చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ శాఖ హాస్టల్ వార్డెన్లు, బీసీ సంక్షేమ శాఖ కార్యాలయం అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనసేన దీక్షకు సీపీఐ సంఘీభావం

విశాలాంధ్ర-నూజివీడు : పట్టణంలోని వెంకటేశ్వరకోవెల సెంటరులో వున్న దేశ మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహాన్ని మార్చడాన్ని నిరసిస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో గురువారం నెహ్రూ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉమ్మడి కృష్ణాజిల్లా జనసేన అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ ప్రారంభించగా సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య,సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు,నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు,రైతు సంఘం నాయకులు రాయంకుల లక్ష్మణరావు తదితరులు నిరసన దీక్షకు మద్దతు ప్రకటించి దీక్ష శిబిరాన్ని సందర్శించారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ సాధించిన 150 మంది గురుకుల విద్యార్థులు

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ : అన్ని సబ్జెక్టుల్లో ప్రతిభ, నైపుణ్యాభివృద్ధి ప్రదర్శించినందుకుగాను పెదతాడేపల్లి అంబేద్కర్ గురుకుల పాఠశాలలోని 150 మంది విద్యార్థులు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ స్థానం సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ బి. రాజారావు అన్నారు. గురువారం తెలుగుబుక్ ఆఫ్ రికార్డులు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్, మెమొంటోన్ ఆయన చేతులమీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలోని పీఠికలను అనర్గళంగా తెలుగు, ఇంగ్లీషు భాషల్లో ప్రాజెక్ట్ రూపంలో విద్యార్థులు వివరించారని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించిన తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ సంస్థ సభ్యులు 150 మందికి స్థానం కల్పించారని తెలిపారు. విద్యార్థి స్థాయి నుంచే అన్ని సబ్జెక్టులతో పాటు రాజ్యాంగం పట్ల అవగాహన కలిగిఉండాలన్నారు. చట్టాలు, సామాజిక హక్కులు, సామాజిక, ఆర్థిక పరిస్థితులపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. వేసవి సెలవులను వృధా చేయకుండా ప్రతీ విద్యార్థి ఇంగ్లీషు చదవడం, వ్రాయడం పై పట్టు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.ప్రతాప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

లేగ దూడల పెంపకంపై అవగాహన

విశాలాంధ్ర-ఉంగుటూరు: జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉంగుటూరు మండలం నాచుగుంట గోశా లలో లేగ దూడల అందాల పోటీలు, దూడల ప్రదర్శన, వాటి పెంపకం పై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ పాకలపాటి గాంధీ మాట్లాడుతూ మేలు జాతి పశు సంపత్ని, పరిశ్రమను బాగా అభివృద్ధి చేయాలని దానికి జిల్లా పశు గణా అభివృద్ధి సంస్థ తోడ్పాటు అందిస్తుందన్నారు. భీమడోలు సహాయ సంచాలకులు డాక్టర్ ఇక్కుర్తి సాయి రమేష్ ఈనాటి లేగ దూడలే రేపటి పశువుల అన్నారు. ఉంగుటూరు పశువుల ఆసుపత్రి లైవ్ స్టాక్ అధికారి డాక్టర్ మల్లెపూడి చిన్న బాబురావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ జేసు రత్నం తదితరులు పాల్గొన్నారు.

కోడి పందాల శిబిరాలపై దాడి

విశాలాంధ్ర - ఆగిరిపల్లి : కోడి పందాల శిబిరంపై దాడి చేసి రూ.20 వేల150 నగదు స్వాధీ నం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ చంటిబాబు తెలిపారు. గురువారం తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో మండలంలోని వడ్లమాను గ్రామంలో గల పామాయిల్ తోటలో జరుగుతున్న కోడి పందాల శిబిరంపై దాడి చేసి 11 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని 2 కోళ్లు,6 కోడి కత్తులు, 2 కార్లు, 11 బైకులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిపై జంతు సంరక్షణ చట్టం కింద కేసులు నమోదు చేశామన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన **M/s. టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లి. (TCHFL)** విజయవాడ బ్రాంచివారి సూచనల మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా, మా వద్ద డోర్ నెం. 5-660, కొత్తూరు గ్రామం, పెదపాడు మండలం, ఏలూరు జిల్లా కాపురస్తులు **గుబ్బల నాగ దుర్గారావు గారి భార్య గుబ్బల లక్ష్మి** దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని **గుబ్బల సోమరాజు గారి కుమారుడు గుబ్బల నాగదుర్గారావు గారి** వద్దనుండి **ది. 21-09-2019న** దఖలు ఆస్తిని దస్తావేజు **నెం.2545/2019ను** ఎస్.ఆర్.ఓ. వట్లూరు నందు రిజిష్టరు కాబడినది. నా క్లయింటు అయిన **M/s. టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లి.(TCHFL)** విజయవాడ బ్రాంచి నందు **గుబ్బల లక్ష్మి** ఋణము కొరకు సంప్రదించియున్నందున సదరు షెడ్యూలు ఆస్తిపై మంజూరు చేయు ఋణముపై ఎవరికైననూ, ఏవిధమైన అభ్యంతరములు, క్లైములు, సెక్యూరిటీలు, హక్కులు, వగైరాలు ఉన్నచో 7 రోజులలోపు వ్రాతపూర్వకముగా ఈ క్రింది అడ్రస్‌కు తెలియచేయవలెనని, గడువు లోపల ఎటువంటి క్లైములు తెలియ చేయనిచో నిష్పేచి ఆస్తిగా భావించి లోను మంజూరు చేయబడును. మరియు గడువు అనంతరం వచ్చు ఆక్షేపణలు వగైరాలు నా క్లైయింటు హక్కులను నిర్బంధించ చేయబడవు.

__షెడ్యూలు:__ పశ్చిమ గోదావరి జిల్లా, వట్లూరు సబ్ రిజిష్ట్రారు యిలాకా, పెదపాడు మండలం, కొత్తూరు గ్రామ పంచాయితీ, కొత్తూరు గ్రామములోని డోర్ నెం.5-660, ఆర్.యస్. నెం. 72/3రు దాఖలా నా తాలూకు చ.గ.144-0-0లు అనగా 120-40 చ.మీ.లు ఆర్.సి.సి. బిల్డింగునకు **హద్దులు: తూర్పు :** దివి శ్రీనివాసాచార్యులు గారి యిల్లు, అ. 39-6లు, **దక్షిణం :** ఎర్రోజు రామాంజనేయులు గారి యిల్లు, అ. 32-6లు, **పడమర :** పంచాయితీ రోడ్డు, అ. 39-6లు, **ఉత్తరం :** పంచాయితీ రోడ్డు, అ. 32-6లు.

కొమ్మిరెడ్డి వెంకటేశ్వరరావు, అడ్వకేట్, డోర్ నెం. 27-1-26/2, అమీనాపేట, ఏలూరు, ఏలూరు జిల్లా, సెల్ నెం: 97009 36669

విద్యార్థులకు ఉన్నత విద్యను అందించవలసిన బాధ్యత ఉపాధ్యాయునిదే

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం కాశిపాడు ఎంపీపీ స్కూల్స్ నెం1, 2 లో గ్రాడ్యుయేషన్ కార్య క్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి పుచ్చల శేషు మాట్లాడుతూ విద్యార్థులకు ఉన్నత విద్యను అందించ వలసిన బాధ్యత ఉపాధ్యాయులపై వున్నదని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు జంపన పద్మావతి రమేష్ రాజు, రైతు భరోసా ఛైర్మన్ చిన్నం సిల్వేస్ట రాజు , ఆరోగ్య సహాయకుడు నామాల రాజు, తెర్లి కృష్ణ రావు,పాఠశాల చైర్మన్ లు సత్యనారాయణ, కాలదాసి సాయి, పాఠశాల హెచ్ఎంలు కె.మంజుల, టి.వి.వైఎస్.రంగ నాయకులు, ఉపాధ్యాయులు, పార్వతి, సి.హెచ్.కృష్ణ ,దుర్గ ప్రసాద్,తల్లిదండ్రులు,తదితరులు పాల్గొన్నారు.

29 న వాహనాలు వేలం పాట

విశాలాంధ్ర-కుక్కునూరు: సారా తరలిస్తూ ఎపి ఎక్సైజ్ యాక్ట్ కేసులలో పట్టుబడిన 16 వాహనాలను ఈనెల 29వ తేదీన కుక్కునూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం పాట నిర్వహించబడునని కుక్కునూరు సిఐ కెవిఎస్ సత్యనారాయణ తెలిపారు. వేలంపాటలో పాల్గొన్న దలచిన వారు రూ.5వేలు డిపాజిట్ చెల్లించడంతోపాటు ఆధార్, పాన్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాల్సిందిగా ఆయన కోరారు. వేలంపాటలో వాహనాలు పొందిన వారు సెంట్రల్ జీఎస్టి 9 శాతం, స్టేట్ జీఎస్టీ 9 శాతం మొత్తం 18 శాతం వెంటనే చెల్లించవలసి ఉంటుందని తెలిపారు.

యువజన సర్వీసుల శాఖ ద్వారా ప్రత్యేక సేవలు

విశాలాంధ్ర-భీమడోలు: యువజన సంఘాలను పునరుద్ధరించి వాటి ద్వారా యువతకు సేవలు అందించేందుకు యువజన సర్వీసుల శాఖ ప్రత్యేక కార్యక్రమం రూపొందించిందని యువజన సర్వీసుల శాఖ కమిషనర్ శారదా దేవి తెలిపారు. భీమడోలులో గుర్తింపు పొందిన యువ జన సంఘాలకు సర్టిఫికెట్ల పంపిణీ , విద్యా ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సెట్ వెల్ సిఇఓ మెహర్ రాజ్ అధ్యక్షత వహించగా కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. గుర్తింపు పొందిన యువజన సంఘాలకు సర్టిఫికెట్ల పంపిణీ , విద్యా ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. దీనిలో భాగంగానే గుర్తింపు పొందిన యువజన సంఘాలకు సర్టిఫికెట్లు పంపిణీ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతుందన్నారు. భీమడోలులో ఇంతవరకు గుర్తింపు పొందిన 5 సంఘాలకు గుర్తింపు సర్టిఫికెట్లను అందజేశామన్నారు . ఈ కార్యక్రమంలో సెట్ వెల్ ఎఒ కెనడి, మేనేజర్ పివిఎస్ఎం సత్యనారాయణ , పర్యాటక శాఖ జిల్లా మేనేజర్ పట్టాభిరామ్ ,భీమడోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాఘవన్ తో పాటు భీమడోలు కు చెందిన స్వచ్ఛంద సంస్థ చైతన్య యువజన సంఘం అధ్యక్షులు మాన్సింగ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షల్లో 71 శాతం ఉత్తీర్ణత

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం శ్రీ చింతలపాటి బాపిరాజు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం రాత్రి విడుదలైన పరీక్ష ఫలితాల్లో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షల్లో 71 శాతం ఉత్తీర్ణ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం రఘు గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం ఇంటర్ మొదటి సంవత్సరం 107 మంది పరీక్షలు వ్రాయిగా అందులో 64 మంది ఉత్తీర్ణులయ్యారని 59.81 శాతం, రెండో సంవత్సరం ఇంటర్ 138 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయిగా 98 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు, 71.10 ఉత్తీర్ణశాతం సాధించారని ఆయన అన్నారు. రెండో సంవత్సరం ఇంటర్ ఎంపీసీలో కె కుసుమ దుర్గాంజలి 1000/ 828 మార్కులు వచ్చాయని బైపిసిలో వి సువర్ణ రాణి 1000/963 మార్కులు వచ్చాయని, సీఈసీ లో సిహెచ్ కె వి పవన్ 1000/ 887 మార్కులు వచ్చాయని, ఎం పి హెచ్ లో ఎం దీప్తి 1000/936 మార్కులు సాధించినట్లు తెలిపారు.

ఆంజనేయస్వామి గుడి పనులను పరిశీలించిన ఉపముఖ్యమంత్రి కొట్టు

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం గోపినాథపట్నంలో ఆంజనేయ స్వామి, శివాలయం గుడి పనులను గురువారం దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రికి పలువురు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పుత్సకాయల విష్ణుమూర్తి ,గంటా లక్ష్మణరావు, వైసిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

29న బీసీ నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం

విశాలాంధ్ర - పాలకొల్లు: ఈనెల 29న కాకినాడ సూర్యారావుపేట, ఆనంద భారతి రోడ్ లోని సూర్యకళ మందిర్ లో జోన్-2 ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల టిడిపి బీసీ నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు టిడిపి నాయకులు గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపారు. జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు కర్నేన గౌరు నాయుడు సారధ్యం వహిస్తారని వెల్లడించారు.

ఇంటర్ ఫలితాలలో శశి విద్యార్థుల హవా

విశాలాంధ్ర -ఏలూరు: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులైన గొట్టాపు నాగరాజన్(990/1000) కొసరాజు స్వరూప్ (985/1000)అత్యధిక మార్కులు సాధించారని, శశి విద్యాసంస్థల వైస్ చైర్మన్ మేక నరేంద్ర కృష్ణ తెలిపారు.మొదటి సంవత్సరం విద్యార్థులైన సన్నికంటి సారా (457/470)పుసునూరి శైలు, అన్నమదాసు శ్యామ్ సాయి తేజ(454/470) అత్యధిక మార్కులు సాధించార న్నారు.ఈ సందర్భంగా శశి కళాశాల ప్రిన్సిపల్ కె. ఎస్.ఎస్.మాధవ్ ఇన్చార్జి సిహెచ్. ఉమా గోవిందరావు, అధ్యాపక బృందం తల్లిదండ్రులకు, విద్యార్థులకు జరిగిన సన్మాన సభలో పుష్పగుచ్చాలతో శశి విద్యాసంస్థల వైస్ చైర్మన్ మేక నరేంద్ర కృష్ణ అభినందించారు.అత్యుత్తమ మార్కులు సాధించిన నాగరాజుకు మేక నరేంద్ర కృష్ణ మేనేజ్మెంట్ తరఫున శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రభుత్వ కళాశాలలో 33% ఉత్తీర్ణత

విశాలాంధ్ర - కలిదిండి: స్థానిక అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 33 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి. త్రినాథ్ గురువారం తెలిపారు.

ఇంటర్ మొదటి సంవత్సరం 470 మార్కులకు ఊసల దేవి (408), పోసిన ప్రవళిక (400), నూకల వర్షిత (393) మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 34 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకు పాము గ్రీష్మ సాయి (933), కుంచె సంధ్యారాణి (888), బోయిన పూర్ణేశ్వర్ (871) మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం 60 మంది విద్యార్థులకు 20 మంది పాసయ్యారని అన్నారు. ద్వితీయ సంవత్సరం 82 మంది విద్యార్థులకు 28 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ఆయన తెలిపారు.

ద్విచక్ర వాహనాల వేలం

విశాలాంధ్ర -కొయ్యలగూడెం : వివిధ కేసులలో పట్టుబడిన 17 ద్విచక్ర వాహనాలను పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్ఐ జీజే విష్ణువర్ధన్ , ఎక్సైజ్ సీఐ జె. శ్రీనివాస బాలాజీ ఆధ్వర్యంలో గురువారం వేలంపాట నిర్వహించారు.

12 వాహనాలను వేలం పాటలో పాల్గొన్నవారు దక్కించుకున్నారు.12 ద్విచక్ర వాహనాల విలువ రూ.1 లక్ష74 వేల 50 యాభై ప్రభుత్వానికి చెల్లించడం జరుగుతుందని ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో కూడా వివిధ కేసులలో పట్టుబడిన నాలుగు ద్విచక్ర వాహనాలకు వేలంపాట నిర్వహించగా ఒక ద్విచక్ర వాహనం మాత్రమే ఒక వ్యక్తి కైవసం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస బాలాజీ తెలిపారు. ఈ వేలంపాట నిర్వహణలో హెడ్ కానిస్టేబుల్ చలం, పోలీస్ సిబ్బంది, ఎక్సైజ్ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల సోషల్ ఆడిట్ పై ప్రధానోపాధ్యాయులకు శిక్షణ

విశాలాంధ్ర-వీరవాసరం: పాఠశాలల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలపై పేరెంట్ కమిటీ సభ్యులందరూ అవగాహన కలిగి ఉండాలని మండల విద్యాశాఖాధికారి బి.వినాయకుడు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోషల్ ఆడిట్ పై ప్రధానోపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పేరెంట్ కమిటీ సభ్యులు పాఠశాలలో జరిగే ప్రతి కార్యక్రమంలోనూ పాల్గొనేలా వారి సహకారం అందించేలా ప్రధానోపాధ్యాయులు వారిని చైతన్య పరచాలన్నారు. పాఠశాలకు ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలు నిధులు తదితర అంశాల గురించి వారికి ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. సోషల్ ఆడిట్ రిసోర్స్ పర్సన్ రమణ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు వారి హక్కులను గురించి తెలియజేయాలన్నారు. పేరెంట్ కమిటీ సభ్యులు పాఠశాలల్లో ఏ అంశాలు పరిశీలించాలి, వాటిపై ఏ విధంగా పై అధికారులను ప్రశ్నించాలి అనే అంశాలను తెలియ జేయాలన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు బి.ప్రభామంజరి, రాయకుదురు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె. వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి తిరుకళ్యాణ మహోత్సవాలు

విశాలాంధ్ర - ఏలూరు: ద్వారకా తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారి వైశాఖమాస తిరుకళ్యాణం మహోత్సవాలకు విచ్చేయాలని సంయుక్త కమిషనరు, ఆలయ కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాధరావు గురువారం జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్‌ను ఆహ్వానించారు. స్థానిక కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ వారిని కలిసి స్వామివారి వైశాఖమాస తిరుకళ్యాణం మహోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. ద్వారకా తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఏప్రియల్ 30వ తేదీ నుంచి మే 7వ తేదీ వరకు స్వామివారి వైశాఖమాస మహోత్సవాలు జరుగనున్నాయి.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు

విశాలాంధ్ర - లింగపాలెం : ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో ధర్మాజీగూడెం శ్రీ సాయి కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఈ విద్యార్థులు పేదరికం, నిరక్షరాస్య కుటుంబాల నుంచి చదువుకుని మంచి ఫలితాలు సాధించి ప్రశంసలు పొందుతున్నారు. ఈ కాలేజీలో ఎంపీసి చదివిన ధర్మాజీగూడెంకు చెందిన ఎల్లి విజయలక్ష్మి వెయ్యికి 983 మార్కులు పొంది 98 శాతం ఉత్తీర్ణత సాధించింది. బైపీసి సెకండ్ ఇంటర్‌లో ధర్మాజీగూడెంకు చెందిన నాగదాసి అనూష వెయ్యికి 965 మార్కులు పొంది 96.5 శాతం ఉత్తీర్ణత సాధించింది. సెకండ్ ఇయర్ సిఇసీలో ఇదే కళాశాలలో చదువుతున్న తిమ్మక్కపాలెంకు చెందిన మాలికల దుర్గారావు వెయ్యికి 875 మార్కులు పొంది 87 శాతం ఉత్తీర్ణత సాధించాడు. వీరు ముగ్గురు భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగాలలో స్థిరపడాలని అంటున్నారు.

శ్రీ సాయి కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలో పలువురు విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. చల్లా లక్ష్మి శిరీష ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో 470 మార్కులకు 460 మార్కులు పొంది 98 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఫస్ట్ ఇయర్ బైపీసీలో ఉమ్మడి మమత 440 మార్కులకు 421 మార్కులు పొంది 96 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఫస్ట్ ఇయర్ సీఈసీలో షేక్ సమీర్ వలీ 500 మార్కులకు 449 మార్కులు పొంది 96 శాతం ఉత్తీర్ణత సాధించాడు.మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ సాంబశివరావు, అధ్యాపక సిబ్బంది, స్థానిక ప్రజలు అభినందిస్తున్నారు.

తెలుగు తమ్ముళ్లకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ

విశాలాంధ్ర - నూజివీడు టౌన్: నూజివీడు నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల పార్టీ కార్యనిర్వాహక కార్యకర్తలకు గురువారం ఒకరోజు ఇంటిగ్రేడ్ శిక్షణ కార్యక్రమం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముద్దరబోయిన మాట్లాడుతూ బూత్ స్థాయి నుండి నూతన వాటర్ల చేరిక ,ఓటర్ల తొలగింపు అంశాలపై గ్రామ పార్టీ అధ్యక్షులు, యూనిట్ ఇన్చార్జిలు బూత్ కన్వీనర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఓటర్ల హౌస్ హోల్డర్ మ్యాపింగ్, నిర్వహించి పార్టీ కార్యక్రమాలను ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు పార్టీ అధిష్టానం తెలియజేస్తూ పార్టీ మరోపేతాని కృషి చేయాలన్నారు. ట్రైనర్లు శావిలి సుభాష్ చంద్రబోస్, రవి కొండపల్లి వాకా కళ్యాణ్ లు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, నూజివీడు మండల పార్టీ అధ్యక్షులు ముసునూరు రాజా, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలి

విశాలాంధ్ర -భీమవరం: న్యాయ వ్యవస్థ గౌరవాన్ని మరింత బలోపేతం చేసేలా యువ న్యాయవాదులు కృషిచేయాలని డీఎన్నార్ విద్యా సంస్థల అధ్యక్ష కార్యదర్శులు గోకరాజు నరసింహ రాజు, గాదిరాజు బాబు అన్నారు. డీఎన్నార్ న్యాయ కళాశాల 34వ వార్షికోత్సవం గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రఘురామ్ అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అట్టడుగు వర్గాలకు కూడా న్యాయం జరిగేలా న్యాయవాదులు కృషిచేయాలని వృత్తిలో రాణించి కళాశాలకు పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ సభ్యులు దత్తాత్రేయ వర్మ, జి.పాండురంగరాజు, కె.రామకృష్ణంరాజు, కె.శివరామరాజు, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

కళ్యాణ మహోత్సవ ముగింపులో మాజీ మంత్రి గొల్లపల్లి

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురంలో కిమ్స్ హాస్పిటల్ అధినేత చైతన్య రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవ ముగింపు కార్యక్రమంలో మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు పాల్గొని పూజలు నిర్వహించి ప్రసాదములు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కసుకుర్తి త్రినాధస్వామి, బేతినీడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించడం దారుణం

విశాలాంధ్ర -భీమవరం: పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించి నిర్మిస్తాననడం జగన్ ప్రభుత్వం వైఫల్యమని, పోలవరం నిర్వాసితులకు అరాకొరా విదిలించాడు దారుణమని పవన్ కళ్యాణ్ త్వరలోనే పోలవరం ప్రాజెక్టు ను సందర్శిస్తారని జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. ఒక ప్రయివేటు కార్యక్రమంలో పాల్గొనడానికి భీమవరం విచ్చేసిన ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు డిజైన్ ప్రకారం 45.72 మీటర్లు నిర్మించకుండా 41.15 మీటర్లు నిర్మిస్తాననడం ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. లక్ష మంది నిర్వాసితులుంటే ఇరవై ఐదు నిర్వాసిత కుటుంబాలకు పది వేల చొప్పున పరిహారం చెల్లించారని ఆయన దుయ్యబట్టారు. కార్యక్రమంలో పిఎసి సభ్యులు కనకరాజు సూరి, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, మాజీ ఎంపి చేగొండి హరిరామజోగయ్య, నాయకులు మల్లినీడి బాబి, బండి రమేష్, చెనమల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భగీరధుడు కఠోర దీక్షా పరుడు

విశాలాంధ్ర-కాళ్ళ: భగీరధుడు కఠోర దీక్షా పరుడు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. భగీరధుని జయంతి ఉత్సవం పెద అమిరం గ్రామంలో నరసాపురం పార్లమెంట్ సగర సాధికార సమితి అధ్యక్షుడు కాలవ వెంకట్రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉండి శాసన సభ్యులు మంతెన రామరాజు,డిసిసిబి చైర్మన్, ఉండి వైసిపి ఇంచార్జ్ పివిఎల్ నరసింహారాజు పాల్గొని పెద అమిరంలో ఉన్న మహర్షి భగీరథ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాముని తన ఒంటి కాలుపై కఠోర దీక్ష చేసి దివి నుండి భువికి గంగను తీసుకొచ్చిన మహనీయుడని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ దొక్కు సోమేశ్వరరావు,జవ్వాది కిషోర్ వేగేశ్న రామ కృష్ణంరాజు,కె.లక్ష్మీ,కె.మాధవి,నర్సింహ మూర్తి, భాస్కరరావు, నారాయణ,వెంకట కృష్ణ ,కె.నరసింహారాజు,జి.నంది రాజు,ఏ. సెబాస్టియన్, అరెపల్లి సాయి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-కుక్కునూరు : జాన్ వెస్లీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజాసేవ కార్యక్రమాలు నిర్విరామంగా జరుగుతున్నాయని, వాటిలో భాగంగా ఉచిత మెడికల్ క్యాంపు గురువారం అటవీప్రాంతమైన అల్లిగూడెం గ్రామం,కుక్కునూరు మండలం లో నిర్వహించారు. స్థానికంగా ఉన్న సుమారుగా 130 మందికి పైగా గిరిజనులకు ఉచితంగా బీ.పీ, షుగర్, హిమోగ్లోబిన్,జనరల్ చెకప్,నిర్వహించి మందులు పంపిణీ చేశారు..మరి ముఖ్యంగా ఈ మెడికల్ క్యాంప్ లో బిపి, షుగర్, హెచ్ బి, వెయిట్, జనరల్ మెడిసిన్,చెకప్ చేశారు. జాన్ వెస్లీ ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ జాన్ వెస్లీ మాట్లాడుతూ పేదలందరికీ ఉచిత వైద్యం అందించాలని నిరు పేదరికంలో ఉన్నవారికి వైద్య సహాయం చేయాలని దృక్పథంతో ప్రజల వద్దకే ఈ మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఒక్కొక్క క్యాంపుకు సుమారుగా 25 వేల రూపాయలు ఖర్చు చేస్తున్నామని ఇప్పటి వరకు రూ27,00,000 వరకు ఖర్చు చేశామన్నారు. ఈ కార్యక్రమం లో నవీన్ లాజరస్, జాన్ వెస్లీ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్.బి.కె సిబ్బందికి శిక్షణ

విశాలాంధ్ర -కొయ్యలగూడెం : ఉద్యాన పంటలను సర్పి లాకర తెల్ల దోమ నివారణ యాజమాన్య పద్ధతులపై స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద కొయ్యల గూడెం మండల ఉద్యాన శాఖ అధికారి ఎన్. ప్రసన్న లక్ష్మీ అధ్యక్షతన కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, జీలుగు మిల్లి, బుట్టాయిగూడెం, మండలాల్లో రైతు భరోసా కేంద్రాలలో పనిచేస్తున్న సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి ప్రసన్న లక్ష్మీ మాట్లాడుతూ రైతు పండించే పంటకు అధిక మోతాదులో ఎరువులు వేసే విధంగా, పంటలకు తెగుళ్ల సోకకుండా రైతులకు ఉద్యాన శాఖ సిబ్బంది తెలియచేయాలని, ఆమె తెలిపారు.

పేదల హక్కుల కోసం పోరాడిన దాసరి

విశాలాంధ్ర-గన్నవరం : పేదల హక్కులకై రాష్ట్రంలో దాసరి నాగభూషణం పోరాడాడని రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్కమాల ఉమామహేశ్వరవు అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం కామ్రేడ్ దాసరి నాగభూషణం 15వ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా ఉమామహేశ్వరవు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర ఉద్యమంలో విద్యార్థి నాయకుడుగా ప్రముఖ పాత్ర వహించిన దాసరి 1955లో నూజివీడు తాలూకా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 55వ ఎన్నికలో నూజివీడు నుండి సీపీఐ అభ్యర్థిగా పోటీ చేశారన్నారు. 1964 నవంబర్ 12న సీపీఐ జిల్లా కార్యదర్శిగా ఎన్నికై పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేసారు. 1971, 97,80 సంవత్సరంలలో విజయవాడ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేశారన్నారు. రాష్ట కార్యదర్శిగా పనిచేసి అనేక పోరాటాలకు నాయకత్వం వహించి పేదల హక్కుల కోసం పని చేసారు. భారతీయ మజ్దూర్ యూనియన్ నిర్మాణంలో కూలి దండు నిర్వహణలో ప్రముఖ పాత్ర వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ గన్నవరం కార్యదర్శి పెద్దు వాసుదేవరావు, కాట్రగడ్డ రామచంద్ర జోషి, కట్టవరపు విజయరావు, రమేషుబాబు, సీహెచ్ వెంకటేశ్వరరావు, గోళ్ల రామచంద్రరావు, తొలుత దాసరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: ఆపదలో ఉన్న వారిని తక్షణం ఆదుకోవడం మానవతా సంస్థ ప్రధాన ధ్యేయమని దేవరపల్లి మానవతా సంస్థ అధ్యక్షుడు బండి సూర్య ప్రకాశరావు వెల్లడించారు. దేవరపల్లిలో శుక్రవారం రాత్రి మండల మానవతా సంస్థ కార్యవర్గ సమావేశం జరిగింది ఈ సమావేశంలో ఎర్నగూడెంలో ఇల్లు కాలిపోయిన వ్యక్తి షేక్ అమీనాకు సుబ్బరాయపురం గ్రామానికి చెందిన రాపాక వీరయ్యకు ఆర్థిక సాయం అందించారు దేవరపల్లి మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన లంక వెంకటేశ్వరావుకు కృత్రిమ కాలు అమర్చుకోవటానికి 14 వేల రూపాయలు ఆర్తి సహాయం అందజేశారు ఈ ఆర్థిక సహాయాన్ని కృష్ణం పాలెం గ్రామానికి చెందిన ఉండవెల్లి అభిషేక్ చౌదరి మానతా సంస్థ ద్వారా అందజేశారు కార్యదర్శి ఈదుపుగంటి నాగేశ్వరరావు నివేదిక అందజేశారు కోశాధికారి తీగల లక్ష్మీనారాయణ జమ ఖర్చులు వివరించారు ఈ సందర్భంగా లంక వెంకటేశ్వరరావుకు మానతా సంస్థ సభ్యులు కృత్రిమ కాలు అందజేశారు దేవరపల్లి కోస్టల్ బ్యాంకు మేనేజర్ భవన నిర్మాణానికి రెండు లక్షల రూపాయలు బ్యాంకు తరపున విరాళం ఇవ్వగా భవన నిర్మాణం కొనసాగుతోంది ఈ కార్యక్రమంలో మానవతార సంస్థ సభ్యులు పప్పు వెంకట రామారావు ఆచంట సుభాష్ చంద్రబోస్ అనిశెట్టి గంగరాజు ఎలమాటి సత్యనారాయణ కేసిరాజు సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవను అలవాటుగా చేసుకోవాలి

విశాలాంధ్ర - కాకినాడ : స్థానిక బాలాజీ చెరువు సెంటర్ కాస్మో పాలిటిన్ క్లబ్‌లో అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కాకినాడ స్వాతి హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో క్లబ్ కార్యదర్శి అలై వసుం ఉపేంద్రనాథ్ అధ్యక్షతన క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అలయన్స్ క్లబ్స్ డిస్ట్రిక్ట్ 106 గవర్నర్ అలై టివి వరలక్ష్మి, విశిష్ట అతిధిగా అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ జాయింట్ పీఆర్వో అలై మాటూరి శిరీష, గౌరవ అతిథిగా అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ అలై డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా ముఖ్య అతిథులచే జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ చప్పిడి మాట్లాడుతూ మనిషి ఎంత సంపాదించినా చివరకు మిగిలేది ఆరడుగుల నేల అన్నారు. మనం సంపాదించే ఆస్తులు కన్నా చేసే సేవలే చిరస్థాయిగా నిలుస్తాయని ప్రతి ఒక్కరూ సేవను అలవాటుగా చేసుకుని సాటివారికి సహాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా టీవీ వరలక్ష్మి మాట్లాడుతూ స్వాతి హెల్పింగ్ హాండ్స్ చేస్తున్న సేవలు అభినందనీయమని, ఈ సంవత్సరం అన్ని క్లబ్‌ల కంటే ముందుగా స్వాతి హెల్పింగ్ హాండ్స్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం చేపట్టడం చాలా ఆనందకరమన్నారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథి శిరీష మాట్లాడుతూ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ లోనే డిస్ట్రిక్ట్ 106 క్లబ్స్‌కి ప్రత్యేక స్థానం ఉందని సేవలు చేయడంలో క్లబ్స్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో ఈ సంవత్సరం నూతన అధ్యక్షునిగా అలై కిరణ్ కుమార్, కార్యదర్శిగా అలై పెంకే గోవిందరాజు, కోశాధికారిగా అలై కొత్త మెహర్ శ్రీరాములు, వైస్ ప్రెసిడెంట్‌గా అలై గాలి రవికృష్ణ, జాయింట్ సెక్రటరీగా అలై మద్దా వికాస్, జాయింట్ ట్రెజరర్‌గా అలై కదలి బ్రహ్మానందం, క్లబ్ పిఆర్వోగా అలై బాలా త్రిపుర సుందరి ఎన్నికయ్యారు.

నియోజకవర్గాన్ని ఎడారిగా మార్చిన ఎమ్మెల్యే గద్దె

విశాలాంధ్ర-విజయవాడ : తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ నియోజకవర్గాన్ని ఎడారిగా మార్చారని కార్పొరేషన్‌లో వైసీపీ ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ అన్నారు. కాల్ మని, సెక్స్ రాకెట్ కేసుల్లో పలువురు జీవితాలు నాశనం చేసిన నీచుడు గద్దె అని, టీడీపీ దొంగల పార్టీ అని, ఆ పార్టీ నేతలు పలువురు చోరీ కేసుల్లో అరెస్టయ్యారని అయన తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పగలు వీధుల్లో తిరుగుతూ రిక్కీ నిర్వహించి రాత్రి వేళల్లో దొంగతనాలు, చోరీలకు పాల్పడేలా టీడీపీ కార్యకర్తలను గద్దె ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. 18వ డివిజన్ టిడిపి అభ్యర్థిగ పోటీ చేసిన పీరుబాబు తో పాటు పలువురు టీడిపి నేతలు చోరీ కేసులో అరెస్ట్ అయ్యారని వివరించారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో టీడీపీ, వైసీపీ నేతలపై ఉన్న కేసుల గురించి చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. రాణిగారితోటలో జరిగిన చంద్రబాబు కార్యక్రమంలో ఆయన సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్న వారందరూ దొంగలు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్ సభ్యులేనని ఆధారాలతో నిరూపితం అయ్యిదన్నారు. విలేఖర్ల సమావేశంలో కార్పొరేటర్లు తంగిరాల రామిరెడ్డి, కలపాల అంబేద్కర్, చింతల సాంబయ్య, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నీలకంఠం శివ ప్రసాద్ వివరణ

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : మే 1 తేదీ నుండి జగ్గయ్యపేట నియోజకవర్గం లో భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న మేస్త్రీ లకు, కూలీలకు కూలీరేట్లను పెంచటం లేదని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) అధ్యక్షులు నీలకంఠం శివ ప్రసాద్ తెలిపారు.గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మేస్త్రి కి రోజుకి రూ.3,000 అలాగే కూలీకి రోజుకి రూ.1500 లు పెంచుతున్నట్లు జగ్గయ్యపేట బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (ఎ ఐ టి యు సి అనుబంధం) పేరుతో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కోదాడ లోని ఒక ప్రెస్ లో కరపత్రాలు ముద్రించి కోదాడ మరియు జగ్గయ్యపేట లలో పంచిపెట్టారని . ఈ విషయాన్ని జగ్గయ్యపేట మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గా ఖండిస్తున్నానని అన్నారు. ఈ కరపత్రంతో మా యూనియన్ కి ఎటువంటి సంబంధం లేదని,ఎవరో అజ్ఞాత వ్యక్తులు యూనియన్ ని డామేజ్ చేసెందుకు ఇటువంటి తప్పుడు కరపత్రాలు ముద్రించి పంచుతున్నారని ఇది క్షమించరాని విషయమని ఆవేదన వ్యక్తం చేసారు.ఆ వ్యక్తులు ఎవరో త్వరలో తెలుసుకుని చట్ట బద్ధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇటువంటి చర్యలను యూనియన్ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.భవన నిర్మాణ యజమానులు ఎటువంటి అనుమానాలు పెట్టుకోవద్దని, ప్రస్తుతం ఇస్తున్న ప్రకారమే మే 1 నుండి కూడా కూలీ రేట్లు ఇవ్వగలరని పేర్కొన్నారు.ఈ విషయం లో ఎటువంటి సందేహం లేదన్నారు.

యువతను నమ్మించి మోసం చేసిన జగన్

విశాలాంధ్ర-విజయవాడ : జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం యువతను పూర్తిగా నిమ్మించి మోసం చేసిందని దాంతో యువత భవిష్యత్తు లేక ఇరత రాష్ట్రాలకు వలసలు వెళు ్తున్నారని పశ్చిమ నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు ఆర్.మాధవ అగ్రహం వ్యక్తం చేశారు.గురువారం ధర్నాచౌక్ వద్ద పశ్చిమ నియోజకవర్గం తెలుగు యువత అధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తిపన్ను,చెత్త పన్ను,తొలగించిన పెన్షన్ లు,టిడ్కోఇల్లులు పేదలకు ఇవ్వకుండా ప్రభుత్వం మొండి వైఖరితో వ్యవహరిస్తున్నారన్నారు.మునిసిపల్ కార్పొరేషన్ ద్వారాగా గత టిడిపి ప్రభుత్వం హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్ళు అందని ద్రాక్షగా మారిందని,పాదయాత్ర లో ఒక్క రూపాయి కే ఇల్లు ఇస్తానని మాటిచ్చిన ముఖ్యమంత్రి ఈరోజు 35000 రూపాయలు వసూలు చేస్తూ అర్హత కలిగిన పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్నరన్నారు. అదే విధంగా విద్యుత్ బిల్లుల షాకులు,నిరుద్యోగులకి జాబ్ క్యాలెండర్ ను ప్రతి ఏటా విడుదల చేస్తానని,అదే విధంగా యువతను,మహిళలను, వృద్ధులను,వితంతువులను,వికలాంగులను కూడాతన పాలనలో మోసం చేసారన్నారు.ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి పైలా సతీష్ మాట్లాడుతూ ఈరోజు ఈ ముఖ్యమంత్రి పేదలకు అందుబాటులో ఉండే ప్రతి వస్తువు పై అధిక ధరలు మోపి పేదవాడి నడ్డి విరచడమే తన ధ్యేయంగా పాలన కొనసాగిస్తున్నారన్నారు.పశ్చిమ నియోజకవర్గం తెలుగు యువత అధికార ప్రతినిధి పూజల శ్రీను మాట్లాడుతూ యువతను మోసం చేయడమే కాకుండా ప్రతి యేటా ఇద్దరు పిల్లలకు అమ్మ ఒడి ఇస్తానన్న జగన్మోహన్ రెడ్డి ఒకరికే అమ్మఒడి పథకాన్ని అమలు పరుస్తూ తల్లులను మోసం చేశారన్నారు.ఈ కార్యక్రమం ఎస్సీసెల్ అధికార ప్రతినిధి పరిశపోగు రాజేష్‌తో పాటు మైనారిటీ నాయకులు తాజుద్దీన్,టిఎన్‌టియుసీ నాయకులు హనుమంతరావు, తెలుగు యువత పశ్చిమ నియోజకవర్గం నాయకులు కోసూరి నూకరాజు, తమ్మినశేఖర్, చిట్టూరి పవన్ కుమార్, రాంపిళ్ళ సూరిబాబు,షేక్ కరీం,బెవరరవికుమార్,గూడేలరామ మణికంఠ,దిలీప్,మస్తాన్,తదితరలు పాల్గొన్నారు.

పరవశింపచేసిన చిత్ర గీతాలాపన

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : తెలుగు కళావాహిని,జి ఆర్ కె పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం కౌతాపూర్ణానందం కళావేదికపై జరిగిన చిత్ర గీతాలాపన ఆద్యంతం శ్రోతలను పరవశింప చేస్తూ సాగింది. గాయని గాయకులుగా స్వాతి, శ్రీదుర్గా నాగమణి,మీనాకుమారి, లక్ష్మీతులసి,షబన,విజయశ్రీ, ఆశయ్య,శివశర్మ,డేవిడ్ రాజు, రాజేష్,శివశంకర్,ఎం రాజు, రమణబాబు తదితరులు షిరిడి యే మా పండరీపురం, నన్ను ఎవరో తాకిరి,అందాల ఓ చిలుక, శేషశైలవాస,సందెపొద్దులకాడ, అబ్బనీ తీయని దెబ్బ,తిరుమల మందిర సుందర వంటి ఇత్యాది పాటలను రసరమ్యంగా పాడి వినిపించారు.